క్లుప్తంగా

ఘనంగా కార్యదర్శికి వీడ్కోలు

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లిలో పని చేస్తున్న కార్యదర్శి రాజేశ్వర్‌కు శనివారం గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యదర్శిగా పనిచేస్తున్న రాజేశ్వర్ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించిన కార్యదర్శిని గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గంటి కోట రాజు, శోభన్‌బాబు, యాదవరెడ్డి, జైపాల్ రెడ్డి, రామచందర్, కార్యదర్శి అరుణ ఉన్నారు.

భీమ్‌దీక్ష సభను విజయవంతం చేయండి



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కొప్పు ఎర్రయ్య ఆధ్వర్యంలో శనివారం భీమ్ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న తలకొండపల్లి ఎక్స్‌రోడ్డు నిర్వహించే భీమ్‌దీక్ష ముగింపు సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం భీమ్‌దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాద్గుల వెంకటయ్య, జగింలి నిరంజన్, పోలే రాజు, సహదేవ్, కృష్ణయ్య, శ్రీనివాస్, హరికృష్ణ,రాజు, బాబు ఉన్నారు.

బీజేహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా టి.నర్సింహ

కొల్లాపూర్: బేడ బుడగజంగాల హక్కుల పోరాట సమితి(బీజేహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా కొల్లాపూర్‌కు చెందిన తూర్పాటి నర్సింహను నియమించారు. ఈ మేరకు బీజేహెచ్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గగనం మంతప్ప నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా తూర్పాటి నర్సింహ మాట్లాడుతూ బుడగజంగాల కులస్తుల హక్కుల పరిరక్షణకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. రిజర్వేషన్లను బుడగజంగాల కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ స్తంభానికి మంటలు



నాగర్‌కర్నూల్ క్రైం: షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ స్తంభానికి మంటలు చెలరేగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ వద్ద విద్యుత్ స్తంభానికి వైర్ల నుంచి పెద్దఎత్తున మంటలు రావడంతో విద్యుత్ స్తంభం వెంట ఉన్న ఇంటర్‌నెట్ వైర్లు పూర్తి గా దగ్ధమయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్ అధికారులతో పాటు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వా రు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది.

మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో పాలమూరు యూనివర్సిటీకి చెందిన కొల్లాపూర్ పీజీ సెంటర్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మూడో రోజు గ్రామంలో మాదద్రవ్యాల నిషేధం, అవి వాడడం వల్ల మనుషులపై పడే ప్రభావంపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ చేసి ప్రజలకు వివరించారు. అక్కడ ఉన్న ప్రజలకు మాదక ద్రవ్యాలు తీసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సంతోష్ కుమార్, అధ్యాపకులు శిరీష, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: పట్టణంలో శనివారం నాగర్‌కర్నూ ల్ జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిలో ఎదురవుతున్న పరిణామాలు, భవిష్యత్ ప్రణాళిక, యూనియన్ విధి విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో డ్యాన్స్‌మాస్టర్ జిల్లా అధ్యక్షుడు భీముడు, గౌరవ అధ్యక్షుడు సత్యం, సలహాదారుడు మురళీధర్‌రావు, మోహన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం రూ.12 లక్షలు ఇవ్వాలి

తెలకపల్లి: దళితులకు అంబేడ్కర్ అభయ హస్తం కింద రూ.12లక్షల రుణాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. శ నివారం మండలంలోని చిన్నముద్దునూరులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళిత వాడల్లో సమస్యలపై స ర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హరీష్, అఖిల్, రమేష్, మల్లేష్, విజయ్, రాములు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

- నేడు ఊరూరా సీతారాముల కల్యాణం
- వేదికలుగా మారిన రామాలయాలు, ఆంజనేయస్వామి గుడులు
- ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు

అచ్చంపేట: శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. 'సీతారాముల కల్యాణం చూతము రారండి' అంటూ రాములోరి పెళ్లి చూసేందుకు జిల్లా సిద్ధమైంది. ఊరూరా రామాలయాలు, ఆంజనేయ స్వామి, ఇతర ఆలయాలు పెళ్లి వేదికలు కానుండగా వీధులన్నీ ఏర్పాట్లతో సందడిగా మారాయి. ఊరంతా వీక్షించేందుకు పందిళ్లు వేస్తున్నారు. ఆదివారం ఘనంగా కల్యాణం నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో, పూలతో, కొబ్బరి ఆకులతో కల్యాణ మండపాలు సిద్ధం చేశారు. ఆలయ పరిసరాలన్నీ సరికొత్త శోభను సంతరించుకున్నాయి. సిరసనగండ్ల సీతారాములల కల్యాణానికి సుమారు పదివేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాములోరి పెళ్లి విందును భక్తులకు అందించేందుకు ఆలయ కమిటీలు అన్నదాన ఏర్పాట్లు పూర్తి చేశారు.

- లింగాల శ్రీకోదండరామస్వామి ఆలయం, చారకొండ మండలం సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో కొన్ని దశాబ్దాలుగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. ఈరెండు ఆలయాల్లో పదిహేను రోజుల పాటు సలేశ్వరం జాతర వరకు వేడుకలు కొనసాగుతాయి. అచ్చంపేట శ్రీ భ్రమరాంబ ఆలయం, శ్రీఆంజనేయ, అయ్యప్ప ఆలయం, శ్రీవాసవీ కన్యాకపరమేశ్వరి, అంజనేయ స్వామి, ఉప్పునుంతల మండలం కంసానిపల్లి సమీపంలోని శ్రీరామగట్టు ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో కల్యాణ వేదికలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఉప్పునుంతల మండల కేంద్రంలో ఈఏడాది కొత్తగా శ్రీరామనవమి సందర్భంగా తేరు, బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు.



కల్యాణానికి ముస్తాబైన లింగాల కోదండరామస్వామి ఆలయం

- వెల్దండ మండల కేంద్రంతో పాటు రాచూర్, కుప్పగండ్ల, కొట్ర, పెద్దాపూర్, చెదురుపల్లి గ్రామాల్లో శ్రీరామ నవమికి ఉత్సవ కమిటీ సభ్యులు హనుమాన్ దేవాలయాలను సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో శనివారం వివిధ దైవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, రాత్రికి ఎదుర్కోళ్ల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పూజారి భాస్కర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- కందనూలు: శ్రీరామ నవమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆలయాలు ముస్తాబు అయ్యాయి. రాంనగర్ కాలనీలో సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరుకానున్నారు.



వెల్దండ మండలం రాచూర్‌లో ఆలయాన్ని సిద్ధం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



జిల్లా కేంద్రంలో రామస్వామి దేవాలయంలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

సీతారాముల ఆలయం ప్రారంభం

తాడూరు: మండలంలోని ఎంగంపల్లిలో నక్కమల్లయ్య దాదాపు 10 ఏళ్లుగా శ్రమించి దాతల సహకారంతో తాను స్వయంగా ఉండి నిర్మించిన సీతారామస్వామి ఆలయాన్ని శనివారం అంగరంగా వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నక్కమల్లయ్యను గ్రామస్తులు సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గిరిజనులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే భోజనం



గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు

బిజినేపల్లి: మండలంలోని కీమ్యాతండా గిరిజనులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కుచుకూళ్ల రాజేష్‌రెడ్డిలు శనివారం మధ్యాహ్నం భోజనం చేశారు. కీమ్యాతండా రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేసి స్థానిక ప్రాథమిక పాఠశాలలో భోజనం గిరిజనులు ఏర్పాటు చేశారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్కరు నాణ్యమైన భోజనం తినాలనే ఉద్దేశ్యంతో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. జిల్లాలో 558 రేషన్ దుకాణాల్లో 2,43,107 రేషన్‌కార్డులు ఉన్నాయని, వాటికి 4946.455 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారు ఉపవాసంతో ఉండకూడదని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం కోసమే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కీమ్యాతండా రేషన్‌కార్డు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం, కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ హాల్య, వీరేందర్, హరీష్‌రెడ్డి, వాల్యానాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శివకుమార్‌ను అభినందించిన కలెక్టర్

కందనూలు: కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌కు భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ అందించిన నేషనల్ యూత్ అవార్డు గ్రహీతను శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ తన కార్యాలయంలో అభినందించి, సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు అవార్డు రావడంతో మన జిల్లాకు మంచి పేరు వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి యువతకు, సామాజిక అభివృద్ధికి ముందడుగు వేయాలని సూచించారు.

చిరస్మరణీయుడు బాబు జగ్జీవన్‌రాం



ఊర్కొండలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కొల్లాపూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- ఆదర్శంగా తీసుకోవాలని నేతల పిలుపు
- విగ్రహాలకు, చిత్రపటాలకు ఘనంగా నివాళులు
- ఊరూరా నివాళులర్పించిన నాయకులు, ప్రజలు

సాక్షి, నెట్‌వర్క్: బాబు జగ్జీవన్ రాంను యువత ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్‌ఐ జగన్, ఆర్‌ఎస్‌ఐలు గౌస్‌పాషా, ప్రశాంత్ కల్యాణ్, శివాజీ ఉన్నారు.

- జిల్లా కేంద్రంలోని సర్వేపల్లి రాధాకృష్ణ భవన్‌లో విశ్రాంత ఉద్యోగులు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.
- అచ్చంపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సోట కాశీం, నియోజకవర్గ ఇన్‌చార్జి సాంబయ్య ఆధ్వర్యంలో వేల డప్పులతో మహార్యాలీ నిర్వహించారు.
- తిమ్మాజిపేట, చేగుంట, గొరిట, పోతిరెడ్డిపల్లి, ఆవంచ, మరికల్ గ్రామాలలో జగ్జీవన్‌రాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బిజినేపల్లి ప్రధాన కూడలి వద్ద బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. పాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు.
- కొల్లాపూర్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, దళితసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పీజీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేశారు.
- ఉప్పునుంతల ప్రభుత్వ కార్యాలయాల ముందు జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దోమలపెంట, ఈగలపెంటలోని శక్తి సదన్ వద్ద భూగర్భ కేంద్రం సీఈ.రామసుబ్బారెడ్డి, ఇంజినీర్లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

- పెంట్లవెల్లి మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో, మల్లేశ్వరం, జటప్రోల్, కొండూరు గ్రామాలలో జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు.
- అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ భారీ ర్యాలీ నిర్వహించారు.
- ఊర్కొండ తహసీల్దార్ కార్యాలయం, ఊర్కొండ గేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, నేతాజీ విగ్రహం వద్ద నవభారతి అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు.
- పెద్దకొత్తపల్లిలో ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ నాగేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- తాడురులో ఎంపీడీఓ ఆంజనేయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.
- తెలకపల్లిలో సింగిల్‌విండ్ వైస్‌చైర్మన్ యాదయ్య బాబ్‌జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేశారు.
- కోడేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు.
- కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయం, కురిమిద్ద, మార్చాలలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- చారకొండ ఎంపీడీఓ క్యాలయంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- లింగాలలో తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పించారు.

శనేశ్వరాలయంలో పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జేష్ఠ్యాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడికి ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు దంపతులు శనేశ్వరునికి తిలతైలాభిషేక పూజలు చేశారు. సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు



తిమ్మాజిపేట: మండలంలోని తిమ్మాజిపేట–జడ్చర్ల ప్రధాన రహదారిపై శనివారం కారు బోల్తా పడిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్‌కు చెందిన సిటి ఫర్నీచర్ యజమాని హానీస్ ఆయన భార్యతో కలిసి కారులో జడ్చర్ల వెళ్తున్నారు. మార్గమధ్యలో ఇందిరానగర్ తండా సమీపంలో రోడ్డుపై కారు అదుపు తప్పి బోల్తా పడింది. భార్య భర్తలకు ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న వారు స్పందించి ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగాల: మండలంలోని పద్మన్నపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం స్వాధీన పర్చుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమాని కిషన్‌నాయక్‌తో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్పీకి ఫిర్యాదు

కల్వకుర్తిరూరల్: పట్టణంలో వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక వర్గం ర్యాలీ నిర్వహించిన సందర్భంగా దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌కు శంకుస్థాపన



ఊర్కొండ: మండలంలోని పేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో తాగునీటి కోసం రూ.5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. దేవాలయానికి సంబంధించి ఎలాంటి సహకారానికైనా ముందుంటామని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఈఓ సత్య చంద్రారెడ్డి, ఉరుకొండ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, అయూబ్ పాషా, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

గుమ్మడి నర్సయ్య అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి
- గుమ్మడి నర్సయ్యకు నిర్మలాదేవి నారాయణరావుల జీవన సాఫల్య పురస్కారం



గుమ్మడి నర్సయ్యకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, తదితరులు

నాగర్‌కర్నూల్: కమ్యూనిస్టు యోధుడు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య రాజకీయ ప్రస్థానం ఆయన త్యాగం, పోరాటం, నిరాడంబరత, చిత్తశుద్ధి, ప్రజలతోనే నేటికీ జీవితం కొనసాగిస్తున్న స్ఫూర్తి ఆదర్శనీయమని శాసన మండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్లో సీఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో చింతలపల్లి నిర్మలాదేవి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారాన్ని గుమ్మడి నర్సయ్యకు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, భాస్కర్‌రావు దంపతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్యను శాలువాతో సత్కరించి మెమొంటో, రూ.25వేల నగదు, సన్మాన పత్రాన్ని అందచేశారు. ఈ సభకు చింతలపల్లి భాస్కర్‌రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కమ్యూనిస్టుగా ఆయన జీవితాన్ని అంకితం చేశాడని, ఆయన ప్రజలకు చేస్తున్న సేవ జనాదరణ అభినందనీయమన్నారు. నేటి యువతే కాకుండా ప్రజా జీవితంలో అందరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.

కీర్తి శేషులు సి.నారాయణ రావు తన రాజకీయ జీవితానికి మొదటి దశలో బాసటగా నిలిచి వారి కుటుంబమంతా అండగా నిలిచిందన్నారు. తల్లి దండ్రులను స్మరిస్తూ అవార్డు నెలకొల్పడం నేటీరోజుల్లో చాలా అరుదైన విషయమన్నారు. అవార్డు గ్రహీత గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ 'నా సేవల్ని నా జీవితాన్ని గుర్తించి సీఎస్ఆర్ విద్యాసంస్థల తరుపున అవార్డు ఇవ్వటం గర్వకారణం'అని అన్నారు. తన జీవితాంతం కమ్యూనిస్టు పార్టీలోనే ఉంటూ ఇల్లెందు ప్రజల గొంతుకగా నిస్వార్థ సేవ చేస్తానని ఆదివాసీల హక్కులకోసం జనంతోనే జీవిస్తూ సమసమాజం కోసం పేదరిక నిర్మూలనకోసం కూలిరేట్లకోసం గిట్టుబాటు ధరలకోసం పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు బాల్ నర్సింహ, ఆనంద్‌జీ, సీపీఎం నాయకులు వర్ధం పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందికొండ గీత, ఎస్‌యూసీఐ ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, గుమ్మడి నర్సయ్య కూతురు ప్రొఫెసర్ అనురాధ, ప్రజాపంథ నాయకులు కృష్ణ, బయోపిక్ డైరెక్టర్ పరమేశ్వర్ హివ్రాలే, డాక్టర్ నూర్జహాన్, కొట్ల వెంకటేశ్వర్ రెడ్డి, నాగవరం బాల్‌రాం, డాక్టర్ రామ్‌కిషన్, సమన్వయ కర్తలు వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, కల్వకోలు మద్దిలేటి పి.వహీద్ ఖాన్, ఎదిరెపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసమే సన్నబియ్యం పథకం



పోలిశెట్టిపల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్



కొండూరులో రేషన్ బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బల్మూర్: సమాజంలో సంపన్నులు తినే సన్నబియ్యం పేదలకు పంపిణీ చేసి సమానత్వం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పోలిశెట్టిపల్లి, బల్మూర్, కొండనాగుల, గోదల్, తదితర గ్రామాల్లో శనివారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు వంగ గిరివర్ధన్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, శ్రీనువాసులు, కృష్ణ, వెంకటయ్య, అంజి, సాయి, మహేష్, పద్మ, చిట్టి, చంద్రమోహన్, వెంకటేష్, బుచ్చన్న పాల్గొన్నారు.

కొండూరులో రేషన్ బియ్యం పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, కేతూరి ధర్మతేజ ప్రారంభించారు. రామకృష్ణ, కురుమయ్య, మధు పాల్గొన్నారు.

ఎదిరేపల్లిలో..

తిమ్మాజిపేట: మండలంలోని ఎదిరేపల్లిలో మహిళలకు కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, చెన్నకేశవ్, నరేందర్ రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శేఖర్, రాజు, డీలర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం

పెద్దకొత్తపల్లి: ప్రజల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించినట్లు మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ అన్నారు. మండల కేంద్రంతో పాటు బాచారం గ్రామాలలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణయ్య, అశోక్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శివశంకర్, చంద్రయ్య, ఎల్లయ్య మల్లేష్, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

పేదలకు వరంలాంటింది

అచ్చంపేట రూరల్: పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయడం వరంలాంటిదని మాజీ ఎంపీపీ రామనాథం అన్నారు. అచ్చంపేట మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌షాపుల వద్ద సన్న బియ్యం పథకం ప్రారంభించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

- లింగాల మండలంలోని ఆయా గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో రంగినేని శ్రీనివాస్‌రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫూలే, అంబేడ్కర్ జాతర కమిటీ ఎంపిక



నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక బాబు జగ్జీవన్‌రాం భవనంలో శనివారం ఫూలే అంబేడ్కర్ జాతర కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా శివప్రసాద్, కార్యదర్శి అంతటి కాశన్న, జెట్టి చిన్న వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సోమనాథ్, వంకేశ్వరం నిరంజన్, సహాయ కార్యదర్శిగా కమలేశ్వర్, బాల వెంకటయ్య, కావలి సురేష్, కొత్రబాలు, ఉదయ్, ప్రచార కార్యదర్శిగా అంజి, వెంకటయ్య, రాములు, అర్జున్, మంగి అంజి, నాగన్న, కొత్తపల్లి అభిమన్య, గౌరవధ్యక్షులుగా వంకేశ్వరుడు చెన్నయ్య, కొత్త వెంకటస్వామి, విజయ్, ప్రభాకర్, ముఖ్య సలహాదారులుగా కొత్తపల్లి వెంకటయ్య, ప్రదీప్, లక్ష్మయ్య, మహేందర్, కార్యవర్గ సభ్యులుగా 10మందిని ఎంపిక చేశారు. ఫూలే, అంబేడ్కర్ జాతరను ఈనెల 23న జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్ట సవరణ ద్వారా దేశంలోని పేద ముస్లిం మైనార్టీలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, బాబీదేవ్, రాఘవేందర్‌గౌడ్, నర్సింహ, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, గంగాధరాచారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: బాలిక అదృశ్యం కావడంతో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంతబజార్ కాలనీకి చెందిన బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. బాలిక కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

8న మండల స్థాయి బాడ్మింటన్ పోటీలు

తెలకపల్లి: 8న మండల స్థాయి బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఎల్ఆర్ విద్యాసంస్థ కరస్పాండెంట్, సింగిల్ విండో డైరెక్టర్ రాజమహేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేందర్‌రెడ్డి స్మారకార్థం సీఎల్ఆర్ విద్యాసంస్థల మాజీ సభ్యులు జ్ఞాపకార్థం ఈనెల 8న మండల కేంద్రంలో కేఎల్ఆర్ స్పోర్ట్స్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 6లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9951098494, 9666561916 నంబర్లను సంప్రదించాలని కోరారు.